# పల్లెకు 'ప్రకృతి' శోభ!

- గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటి వనాలు ఏర్పాటు
- ఏపుగా ఎదిగి ఆహ్లాదాన్ని పంచుతున్న మొక్కలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు



రామకృష్ణకాలనీ పల్లెప్రకృతి వనం

తిమ్మాపూర్, అక్టోబర్ 24: తెలంగాణ ప్రభుత్వం వచ్చాక గ్రామాలు ఎంతగానో అభివృద్ధి చెందుతున్నాయి. ఈ క్రమంలో ఒకప్పటి పచ్చదనం తగ్గిపోతుండడంతో ప్రభుత్వం రెండేళ్ల కింద పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. గ్రామానికి అర ఎకరం నుంచి ఎకరం విస్తీర్ణంలో అనేక రకాల మొక్కలు నాటి వనాలను ఏర్పాటు చేయగా, అవి ఇప్పుడు ఏపుగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతుండగా గ్రామస్తుల్లో హర్షం వ్యక్తమవుతున్నది.

తిమ్మాపూర్ మండలంలోని 23గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. చాలా గ్రామాల్లో వనాల కోసం గ్రామ నడిబొడ్డునే ఉన్న స్థలాన్ని ఎంపిక చేశారు. అనేక రకాల నీడనిచ్చే మొక్కలతో పాటు పండ్లనిచ్చే మొక్కలను సైతం నాటారు. నేడు అవి ఏపుగా పెరిగి పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నాయి. మరో కొన్నిరోజుల్లో పండ్ల చెట్లు ఫలాలను సైతం అందించనున్నాయి.

### ఉదయం నడకకు వాకింగ్ ట్రాక్‌లు ..

పల్లె ప్రకృతి వనంలో పార్కుల తరహాలో వాకింగ్ ట్రాక్‌లు సైతం ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం పూట ఆ ట్రాక్‌ల వెంబడి గ్రామీణులు వాకింగ్ కూడా చేస్తున్నారు. చిన్నపిల్లలు సైతం పచ్చని వాతావరణంలో గడుపుతున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ట్రాక్‌ల్లో నడుస్తూ ఆరోగ్యాన్ని పెంపొందించుకుంటున్నారు. వీటిని ఉపాధి హామీ పథకం ద్వారా పల్లెప్రకృతి వనాలను నిర్వహిస్తున్నారు. ప్రతి నిత్యం మొక్కల పాదుల్లో గడ్డి తొలగించడం, నీటిని పట్టడం చేస్తున్నారు.

### ఆక్రమణలకు అడ్డుకట్ట

ప్రకృతి వనాలను ప్రతి గ్రామంలో అర ఎకరం నుంచి ఎకరానికి పైగా విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో వీటిని ఏర్పాటు చేయడంతో పచ్చదనం పెంపొందడంతోపాటు ప్రభుత్వ భూముల కబ్జాలను అరికట్టేందుకు దోహదపడ్డాయి. వనాల చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో ప్రతి మొక్క ఏపుగా పెరిగి చెట్లుగా ఎదుగుతున్నాయి.

### ఎటు చూసినా పచ్చదనమే



గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు గ్రామాల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. గ్రామాల నడిబొడ్డున అడవులు సృష్టించినట్టుగా పచ్చదనంతో అందంగా కనిపిస్తున్నాయి. వనాల్లోని ట్రాక్‌లలో ఎంతోమంది గ్రామస్తులు ఉదయం, సాయంత్రం నడకతో స్వచ్ఛమైన గాలి నడుమ ఆరోగ్యాన్ని పొందుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏం చేసినా గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమే చేస్తుంది. వనాలతో పాటు సంపద వనాలు, హరితహారం మొక్కలతో ఎటు చూసినా పచ్చదనమే కనిపిస్తున్నది.

*-కేతిరెడ్డి వనిత, తిమ్మాపూర్ ఎంపీపీ*

## పండుగ పూట విషాదం

- ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి యువకుడు మృతి



శివకుమార్(ఫైల్)

తిమ్మాపూర్, అక్టోబర్ 24: దసరా పండుగ పూట ఓ యువకుడు ప్రమాదవశాత్తు కాకతీయ కాలువలో పడి మృతిచెందాడు. ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్‌కు చెందిన ఎలిగేటి శివకుమార్(20) ఇటీవల భవానీ మాల ధరించాడు. సోమవారం సాయంత్రం మాల విరమణ చేసి కాకతీయ కాలువలో స్నానం చేయడానికి తోటి భక్తులతో కలిసి వచ్చాడు. స్నేహితులు కెనాల్ గట్టుపైన ఉండగానే శివకుమార్ త్వరత్వరగా వెళ్లి మాలను నీటిలో వేస్తుండగా కాలు జారి కాలువలో పడ్డాడు. స్నేహితులంతా చూస్తుండగానే కాలువలో గల్లంతైపోయాడు. దీంతో స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. తండ్రి మహేశ్, కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హుటాహుటిన ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. దీంతో ఎస్ఐ ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి కెనాల్ నీటిని నిలిపివేయించారు. మంగళవారం ఉదయం గల్లంతైన కొద్దిదూరంలోనే శివకుమార్ మృతదేహం లభ్యమైంది. ఘటనా స్థలం వద్ద కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఎదిగిన కొడుకు ప్రమాదంలో మరణించడంతో తల్లిదండ్రులు రోదించారు. శివకుమార్ తండ్రి మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి తెలిపారు.

## యువకుడిపై కత్తిపోటు

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 24: పాత కక్షలతో ఓ యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మాతంగి చందు, శేఖర్‌కు అదే గ్రామానికి చెందిన కనకం డేవిడ్‌కు పాత గొడవలున్నాయి. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం మళ్లీ గొడవ పెట్టుకుని.. చందు అనే యువకుడు డేవిడ్‌ను పొడిచాడు. గాయాలపాలైన అతడిని వెంటనే కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకెళ్లారు. డేవిడ్ అన్న కల్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి తెలిపారు.

## నర్మెట మండల ఇన్‌చార్జిగా దేవేందర్ రెడ్డి



ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డితో దేవేందర్ రెడ్డి, సంపత్‌రెడ్డి

చిగురుమామిడి, అక్టోబర్ 24: చిగురుమామిడి మండలంలోని చిన్న ముల్కనూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ముప్పిడి దేవేందర్ రెడ్డి జనగామ నియోజకవర్గం నర్మేట మండలం పార్టీ ప్రచార ఇన్‌చార్జిగా నియామకమయ్యారు. ఈ మేరకు దేవేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తామన్నారు. పార్టీ గెలుపుకోసం కృషి చేస్తామన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ తిమ్మాపూర్ మండల ఉపాధ్యక్షుడు దావు సంపత్‌రెడ్డి, నాయకులు మాచర్ల శ్రీనివాస్, మెంగాని తిరుపతి తదితరులు ఉన్నారు.

## యువతి ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి

తిమ్మాపూర్, అక్టోబర్ 24: ఓ యువతి మృతికి కారణమైన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన రాపర్తి స్వామి అలియాస్ శ్యాం అదే గ్రామానికి చెందిన ఓ యువతితో తాను గతంలో దిగిన ఫొటోను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టాడు. దీంతో ఆమెకు వచ్చిన సంబంధాలు చెడిపోయాయి. మనస్తాపానికి గురైన ఆ యువతి కొన్నినెలల క్రితం పురుగుల మందు తాగి.. చికిత్స పొందుతూ మరణించింది. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సమగ్ర దర్యాప్తు చేశారు. సదరు యువతి ఆత్మహత్యకు రాపర్తి స్వామి కారణమని గుర్తించి, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



మానకొండూర్: శమీపూజలో పాల్గొన్న జడ్పీటీసీ శేఖర్‌గౌడ్, గ్రామస్తులు



చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్ఐ

## ఆనందోత్సాహాలతో దసరా వేడుకలు

తిమ్మాపూర్/ మానకొండూర్/ రూరల్/ చిగురుమామిడి/ గన్నేరువరం, అక్టోబర్24: మానకొండూర్ నియోజకర్గ వ్యాప్తంగా విజయదశమి వేడుకలను ప్రజలు సోమవారం ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. తిమ్మాపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో శమీ పూజ నిర్వహించారు. కార్యక్రమాల్లో మండల, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మానకొండూర్ మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియా వద్ద నిర్వహించిన దసరా వేడుకల్లో జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్ పాల్గొని శమీపూజ నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన వేంకటేశ్వరస్వామి రథోత్సవం కనుల పండువగా సాగింది. మానకొండూర్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో స్థానిక పెద్దచెరువుకట్టవద్ద ఏర్పాటు చేసిన రావణాదహన కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్‌తోపాటు సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, ఉపసర్పంచ్ నెల్లి మురళి, వార్డు సభ్యులతోపాటు నాయకులు గుర్రం కిరణ్‌గౌడ్, ఉండింటి శ్యాంసన్, పిట్టల మధు, కొత్తకొండ నాగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానకొండూర్ మండలం వన్నారం గ్రామంలో సర్పంచ్ పొలాడి కవిత-వంశీధర్ రావు, సీనియర్ నాయకుడు పొలాడి రామారావు ఆధ్వర్యంలో గ్రామదేవతలకు పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో దుర్గాదేవి నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

చిగురుమామిడి మండలంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగగా, మండల కేంద్రంలో ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీ గీకురు రవీందర్, సుందరగిరిలో సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, ఆలయ చైర్మన్ గందె సంపత్ పాల్గొన్నారు. పలు గ్రామాల్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బొడ్రాయికి పూజలు చేశారు. సాయంత్రం వేళలో పాలపిట్టను చూసేందుకు ఊరు పొలిమేరలకు వెళ్లారు. కార్యక్రమంలో సర్పంచులు పిట్టల రజిత, చెప్యాల మమత, పీచు లీల, గుంటి మాధవి, అందె స్వరూప, పెద్దపెల్లి భవాని, నాగెల్లి వకుళాదేవి, బెజ్జంకి లక్ష్మణ్, జక్కుల రవి, కానుగంటి భూమిరెడ్డి, శ్రీ మూర్తి రమేశ్, సుద్దాల ప్రవీణ్, సన్నిల్ల వెంకటేశం, బోయిని శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ చాడ శ్రీధర్ రెడ్డి, ఉప సర్పంచ్ మోర ప్రవీణ్, గ్రామస్తులు నాగిళ్ల సదానందం, బండోజు రమేశ్, అరిగెల రమేశ్, చాడ వేణుమాధవ్ రెడ్డి, దొడ్ల రమణారెడ్డి పాల్గొన్నారు.

గన్నేరువరం మండల వ్యాప్తంగా విజయ దశమి సంబురాలు అంబరాన్నంటాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పారువెల్ల గ్రామంలో ఓ ఆలయ విషయంలో నెలకొన్న వివాదంతో గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోవడంతో సోమవారం దసరా వేడుకలు జరుపుకోలేదు.



శంకరపట్నం: కన్నాపూర్ గ్రామంలో జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు